క్లుప్తంగా

విద్యార్థినులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ



ఏలేశ్వరంలో విద్యార్థినులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థునులకు గురువారం ఉచితంగా స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు సామంతుల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం అతని సోదరుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ పాఠశాలలోని విద్యార్థినులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ విద్యార్థునులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, సామంతుల శ్రీనివాసరావు, దాసరి గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు అభినందనల వెల్లువ



లింగంపర్తిలో సుబ్బారావుకు అభినందనలు తెలుపుతున్న జెడ్పీటీసీ రాజరాజేశ్వరి

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు గురువారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు మండలంలోని లింగంపర్తిలో తన ఇంటి వద్ద వరుపులను కలుసుకుని పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలుపుతున్నారు. ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, బెహరా దొరబాబు తదితరులు వరుపులను మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే వరుపుల పార్టీ శ్రేణులకు సూచించారు.

అధ్యాపకుడికి నేషనల్ గ్లోబల్ టీచర్ అవార్డు



అవార్డు గ్రహీత శ్రీనివాసరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు

తుని రూరల్: మండలంలోని కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) అధ్యాపకుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరావుకు నేషనల్ గ్లోబల్ టీచర్ అవార్డు లభించింది. గత నెలలో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన శ్రీనివాసరావును గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. రసాయన శాస్త్రంలో వృత్తి నైపుణ్యం, సేవా కార్యక్రమాలకు గాను ఏకేఎస్ ఎడ్యుకేషన్స్ ఈ అవార్డును అందజేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీధర్, రసాయనిక శాస్త్రం హెచ్‌ఓడీ ఢిల్లేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణ, స్థానిక 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాయినగర్, ఎంఆర్ పేట, ఫైర్ ఆఫీసు, శ్రీరామా థియేటర్, గొల్ల అప్పారావు సెంటర్, నక్కిన వీధి, చేపల మార్కెట్, గరువు వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి, అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు తెలిపారు. మండలంలోని ఒంటిమామిడి, దానవాయిపేట, అద్దరిపేట, ఎల్లయ్యపేట, జి.ముసలయ్యపేట, కృష్ణాపురం, తొండంగి, పైడికొండ, ఆనూరు గ్రామాల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

లబ్ధిదారుల ఇంటికే పథకాలు

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కొత్తూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



కొత్తూరులో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలంలోని కొత్తూరు, తొండంగి మండలం పీఈ చిన్నాయపాలెం గ్రామాల్లో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు ఆధ్వర్యాన పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాగుందా ? లేదా ? అని మహిళలను ఆరా తీశారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ గతంలో ఏదైన పని ఉంటే ప్రజలు మండల కేంద్రంలో ఉండే కార్యాలయాలకు వెళ్లి లైన్లో నిలబడి, రోజుల తరబడి అలసిపోయేవారన్నారు. ఇప్పుడు పరిపాల మన ఊరులోనే సచివాలయాల్లో జరుగుతోందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. పారదర్శక పాలన అందించడంలో లోటుపాట్లను గుర్తించేందుకే ఇంటింటా పర్యటనలు చేస్తున్నామన్నారు. అటువంటి పరిపాలన కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగరవేశారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, సర్పంచ్ దుంగల గణపతి రోజారాణి, ఎంపీటీసీ కిల్లి సన్యాసిరావు, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కొత్తూరులో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

దుష్ప్రచారంతో ప్రజలను మోసం చేయలేరు

- మంత్రి దాడిశెట్టి రాజా
- పీఈ చిన్నాయపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పీఈ చిన్నాయపాలెంలో లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలు, పచ్చమీడియా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసి మరోసారి ప్రజలను మోసం చేయలేరని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తొండంగి మండలం పీఈ చిన్నాయపాలెంలో ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛనును గురువారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ నేతలు తన పచ్చమీడియా ద్వారా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవాలను అవాస్తవాలుగా తమ పత్రికల్లో విషప్రచారం చేసినా ప్రజలు మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. వాస్తవాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలో ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు, విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు దడాల విజయ్‌కుమార్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళిపూడి ఆంజనేయులు, సర్పంచ్ పసుపులేటి పద్మవిజయ, ఎంపీటీసీ గుల్ల మంగ, మాజీ సర్పంచ్ ములికి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం కోటనందూరులో పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన కోటనందూరు-2 గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు పెరిగిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టెన్త్ విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. సంకల్పం టీమ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందజేశారు. ఈ పుస్తకాలను అందిపుచ్చుకుని ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని సంకల్పం టీమ్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.రాంబాబు, ఉపాధ్యాయులు, సంకల్పం టీమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు గురువారం ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, ఈగల అప్పారావు, శెట్టిబత్తుల కుమార్‌రాజా, గొల్లు చిన్నదివాణం, పంచాది వీరబాబు, జిగిరెడ్డి శ్రీను, దోనే చిట్టిబాబు, నరాల శ్రీను, గాబు కృష్ణ, గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తునిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 25 వార్డులోని రామకృష్ణాకాలనీ సాయిబాబా గుడి వద్ద రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం చైర్‌పర్సన్ సుధారాణి శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలోని రోడ్లు, కాలవలను నిర్మిస్తున్నామన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలపించాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, పట్టణ యువత అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్ కాసే సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు,అధికారులు పని చేయాలని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తుపాను బాధితులను ఆదుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైన్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకటరమణ, ఎంపీపీ జి.శివ రామకృష్ణ, ఎంఈఓ ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

సారా కేసులో నిందితుడికి రూ.10 వేల జరిమానా

ప్రత్తిపాడు: సారా కేసులో పలుమార్లు పట్టుబడిన నిందితుడికి ప్రత్తిపాడు తహసీల్దార్ రూ.10 వేల జరిమానా విధించారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల కృష్ణ పలు సారా కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. అనేక సార్లు సారా కేసుల్లో పట్టుబడిన కృష్ణను స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ అరెస్టు చేసి గురువారం స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరచగా, తహసీల్దార్ రూ. 10 వేలు జరిమానా విధించారు. ముద్దాయి కాండ్రేగుల కృష్ణ జరిమానా చలాను రూపంలో చెల్లించినట్టు సీఐ అశోక్ తెలిపారు.

ధర్మవరంలో బెల్ట్ షాపులపై దాడి

మండలంలోని ధర్మవరంలో బెల్ట్ షాపులపై దాడిచేసి పది 180 మిల్లీ లీటర్ల డ్యూటీ పేయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు గురువారం స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన ముద్దాడ నల్లబ్బాయి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

సెబ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో శ్రీరంగం వెంకట సత్యనారాయణను, టి.రాయవరంలో 15 లీటర్ల సారాతో సూరంపూడి సత్యనారాయణ, ముప్పిడి శంకరయ్యలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ముగ్గురు నిందితులతో పాటు పలు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న ధర్మవరం గ్రామానికి చెందిన మరో 11 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, స్థానిక తహసీల్దార్ వద్ద హాజరుపరిచినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

మకరజ్యోతి దర్శనానికి తరలిన అయ్యప్ప భక్తులు



ఎస్.అన్నవరం నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

తుని రూరల్: శబరిమలలో ఈ నెల 15న మకరజ్యోతిని దర్శించేందుకు మండలానికి చెందిన అయ్యప్ప భక్తులు బయలుదేరి వెళ్లారు. 41 రోజుల పాటు మండల దీక్ష పూర్తి చేసిన ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన 72 మంది అయ్యప్ప భక్తులు స్థానిక రామాలయంలో ఇరుముడులు కట్టుకుని శబరిమలకు పయనమయ్యారు. చోడిశెట్టి కన్నా ప్రకాష్, చోడిశెట్టి సూర్యనారాయణ గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారణ భక్తులు శరణఘోష చేస్తూ తుని రైల్వే స్టేషన్‌కు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ నియమనిష్ఠలతో దీక్ష పూర్తి చేసిన తామంతా శబరిమలైలో కొలువుదీరిన అయ్యప్పస్వామిని దర్శించుకుంటామన్నారు. 70 కిలో మీటర్లు వనయాత్ర చేసి స్వామివారి సన్నిధానంలో మకరజ్యోతిని దర్శించుకుంటామని చెప్పారు.

గోదాదేవికి దీపాలంకార సేవ



ఎస్.అన్నవరంలో గోదాదేవి అమ్మవారికి దీపాలంకార సేవ చేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి గురువారం దీపాలంకార సేవ నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపాలంకార సేవ చేశారు. అమ్మవారి దీపాలను వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు. ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



కుమ్మరిలోవలో కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో కాలభైరవ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. మార్గశిర అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర పుష్పార్చన, వేదపారాయణ సేవలు, పంచహారతులు నిర్వహించారు. వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి



ప్రత్తిపాడులో రాజకీయ పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఈఆర్ఓ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గతేడాది డిసెంబర్ 26లోగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించిందన్నారు. పలు ప్రాంతాల్లో ఇంకా సవరణలు జరగాల్సి ఉన్న కారణంగా జనవరి 12లోగా తుది జాబితాలను పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. నియోజకవర్గంలో ఒకే పోలింగ్ స్టేషన్‌లో 820, వేరే పోలింగ్ స్టేషన్‌లో 1,819, ఓటరు జాబితాలో ఒకే ఫొటోతో ఉన్న 571 మంది ఓటర్లను గుర్తించి సరిదిద్దామన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం దాఖలైన దరఖాస్తుల్లో వివరాలు సక్రమంగా లేని 36 అర్జీలను తిరస్కరించామని చెప్పారు. నియోజకవర్గవ్యాప్తంగా కొత్త ఓటు హక్కు నమోదుకు వచ్చిన 12,575 అర్జీల్లో 11,901 క్లెయిమ్‌లను పరిష్కరించి, 273 పెండింగ్‌లో ఉంచామన్నారు. తొలగింపుల కోసం దాఖలైన 11,026 ఫారం-7లలో 10,965 పరిష్కరించి, 61 పెండింగ్‌లో ఉంచామన్నారు. డోర్ నంబర్ జీరోతో ఒక్క ఓటు కూడా ఉండరాదని, డోర్ నంబరు తప్పక ఉండేలా బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నియోజకవర్గ సెలక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్‌పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగే రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ కొనసాగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలపై కూడా దృష్టి సారించాలన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎక్కడైనా ఓటింగ్‌ను అడ్డుకున్న సంఘటనలు, ఓటింగ్ సమయంలో అర్థ, అంగ బలం ప్రదర్శించే వ్యక్తుల, ఘర్షణలు, కొట్లాటలు, గందరగోళం సృష్టించే పరిస్థితులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రత్తిపాడు సీఐ కె.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి.చిన్నారావు, కె. నాగసుబ్రహ్మణ్యం, జి.భీమారావు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమేశ్వరికి విశిష్ట మహిళా పురస్కారం



సావిత్రీబాయి పూలే విశిష్ట మహిళా పురస్కారం అందుకుంటున్న వేమేశ్వరి

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ సంఘ రాష్ట్ర కో కన్వీనర్ ఇమంది వేమేశ్వరి విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా విశాఖ పబ్లిక్ గ్రంథాలయం ఆవరణలో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ (ఎస్‌పీఈసీటీ-స్పెక్ట్) బుధవారం రాత్రి జయంతోత్సవం నిర్వహించింది. ఈ ఉత్సవంలో స్టీల్ ప్లాంట్ సీవీఓ ఎస్.కరుణరాజు, సంగివలస మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ పీవీ సుధాకర్, స్పెక్ట్ చైర్‌పర్సన్ గుండూరు సీతామహాలక్ష్మి తదితరులు వేమేశ్వరిని శాలువాతో సత్కరించి, విశిష్ట మహిళా పురస్కారాన్ని అందజేశారు. విశిష్ట మహిళా పురస్కారం అందుకున్న వేమేశ్వరిని పలువురు అంగన్‌వాడీ వర్కర్స్ సంఘ సభ్యులు అభినందించారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ



కిర్లంపూడిలో అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేస్తున్న మహిళలు

కిర్లంపూడి: మండల కేంద్రమైన కిర్లంపూడిలో గురువారం గడపగడపకూ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి శ్రీరాముని జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ప్రజలకు అందజేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం రోజున ఈ అక్షతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు, విజ్ఞాన భారతీ పాఠశాల విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయుడు దాడి సూరిబాబు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య పాదుకయాత్ర

గోకవరం: మండలంలోని గాదెలపాలెంలో గురువారం అయోధ్యరామయ్య దివ్యపాదుక యాత్ర, అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మ ప్రబోధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో సమితి సభ్యులు, గ్రామస్తులు పాదుకలను తలపై ఉంచుకుని ఇంటింటికీ వెళ్లి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ కమ్మెల అచ్చిబాబు, కుంచే శివాజీ, పిల్లంగోరు పాపారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షతలు పంపిణీ

జగ్గంపేట: అయోధ్య రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంగయమ్మపురంలో గురువారం సీతారాముల అక్షతలను పంపిణీ చేశారు. రామ నామ సంకీర్తన, సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అక్షతలను వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలు

కిర్లంపూడి: ప్రజల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని రాజుపాలెం, కృష్ణవరం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. పథకాలకు అర్హులై లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడమే లక్ష్యంగా గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

గంగవరంలో...

రౌతులపూడి: మండలంలోని గంగవరంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సైపురెడ్డి వెంకటరమణ, ఉప సర్పంచ్ ఎం.పాపారావు పాల్గొన్నారు.